సాక్షి

ఆదిలాబాద్

బుధవారం । 14 । మే । 2025



సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు
జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో నిర్వహించనున్న సరస్వతీ పుష్కరాలకు ఆర్టీసీ సన్నద్ధమవుతోంది. ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తుంది. 8లో▸



ఏళ్లు గడుస్తున్నా.. ఎదురుచూపులే!
బోథ్ నియోజకవర్గ కేంద్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఏళ్లుగా సమస్యలు రాజ్యమేలుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
38.0/28.0

వాతావరణం
మధ్యాహ్నం ఎండతీవ్రత ఉంటుంది. ఉక్కబోత ప్రభావం కనిపిస్తుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పాలిసెట్



హాల్‌టికెట్ నంబర్లు పరిశీలిస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం మంగళవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలో మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష కొనసాగింది. నిమిషం ఆలస్యం నిబంధన ఉండడంతో విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. 1,102 మందికి గాను 1026 మంది హాజరయ్యారు. ఆయా కేంద్రాలను ప్రభుత్వ సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు పరిశీలించారు.

శిక్షణతో సంస్కారం



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ఆదిలాబాద్: శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో 20 రోజులపాటు నిర్వహించిన బాల సంస్కార్ వేసవి శిక్షణ శిబిరంతో విద్యార్థుల్లో సంస్కారం అలవడుతుందని సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఆరే భూమన్న, కోరెడ్డి లెనిన్ అన్నారు. సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరం ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ప్రశంసా పత్రాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ, శిబిరంలో నేర్చుకున్న శ్లోకాలు, వేదమంత్రాలు, భజన వంటి అంశాలతో విద్యార్థుల్లో ఆధ్యాత్మికత పెంపొందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు రవిశంకర్, సభ్యులు హనుమాన్లు, శ్రీధర్, శిక్షకులు భవాని, ఆనంద్, పూర్ణ చందర్, సంతోష్ , పుష్ప, కమల పాల్గొన్నారు.

జొన్నల కొనుగోళ్లు వేగవంతం చేయాలి

సాత్నాల: అకాల వర్షాలు పొంచి ఉన్న నేపథ్యంలో జొన్న కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నెలాఖరులోపు జొన్నల కొనుగోలు ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు సుభాష్, అశోక్‌రెడ్డి, సంతోష్, సన్ని, తదితరులున్నారు.

బోధన సామర్థ్యాలు పెంపొందించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులు బోధన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని డీఈవో ఏనుగు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. ఐదు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, సెక్టోరియల్ అధికారి సుజాత్ ఖాన్ తదితరులుపాల్గొన్నారు.

టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి

ఆదిలాబాద్‌టౌన్: టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన చాంబర్ నుంచి మెడికల్ ఆఫీసర్లతో మంగళవారం జూమ్ ద్వారా సమీక్షించారు. టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 19 నుంచి జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి క్షయ నిర్ధారణ పరీక్షలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా బీపీ, షుగర్, మద్యపానం చేసే వారికి, వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, జిల్లా టీబీ నియంత్రణ అధికారి సుమలత, ప్రోగ్రాం అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

'ఉత్తమ' విద్యార్థులకు ప్రశంస

కైలాస్‌నగర్: జిల్లాలోని జ్యోతిబాపూలే, సాంఘిక, గిరిజన, మైనారిటీ సంక్షేమ కళాశాలల్లో ప్రతిభ కనబరిచిన ఇంటర్ విద్యార్థులను కలెక్టర్ రాజర్షి షా ప్రశంసించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఆయా కళాశాలలకు చెందిన 11 మందిని అభినందించి భవిష్యత్‌లో మరింత రాణించాలని ఆకాంక్షించారు. ఆదిలాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఎంపీసీలో 992 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచిన ఆడే వాసవిని ప్రత్యేకంగా అభినందించారు. ఇందులో డీఈవో, డీఐఈవో తదితరులు పాల్గొన్నారు.

క్లియరెన్స్.. టెన్షన్!



ఇతని పేరు గుట్ట ప్రవీణ్. 46 సంవత్సరాలు. ఆదిలాబాద్ పట్టణం పాత హౌసింగ్ బోర్డు కాలనీ. క్లాస్–1 కాంట్రాక్టర్‌గా వ్యవహరించాడు. నాలుగు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. ప్రధానంగా ఈయన ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, మున్సిపాలిటీలకు సంబంధించిన అనేక రోడ్లు, వంతెనలు, ఇతరత్రా పనులు నిర్వహించాడు. ఇతడికి సంబంధించి సుమారు రూ.60 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి క్లియరెన్స్ కోసం తిరుగుతున్న మంజూరు కావడం లేదు. ఈ క్రమంలో ఒత్తిడికి గురై గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ప్రవీణ్ మాత్రమే కాదు.. పలువురు కాంట్రాక్టర్లు ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లుల కోసం తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.



“ ఇది జిల్లా కేంద్రంలోని మావల నుంచి దస్నాపూర్ వచ్చే ప్రధాన రహదారి డివైడర్‌కు ఒక వైపు భాగం. 2023–24లో ఈ రహదారిని అభివృద్ధి పర్చేందుకు ఆర్‌అండ్‌బీ ద్వారా రూ.13కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం వర్క్ మంజూరు చేసింది. డివైడర్‌కు మరోవైపు పనులు పూర్తయ్యాయి. అయితే ప్రభుత్వం నుంచి అరకొరగా బిల్లులు వచ్చాయి. మంజూరులో తాత్సారం కావడంతో కాంట్రాక్టర్ చేసేది లేక ఆ పనులు చేపట్టలేకపోయాడు. ప్రస్తుతం ప్రభుత్వం ఆ బిల్లులను చెల్లించడం లేదు. మరో వైపు ఇలాంటి అనేక రోడ్ల పనులు జిల్లాలో నిలిచిపోయాయి. దీంతో ఈ మార్గంలో వెళ్లే జనం ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి.

- బిల్లులు పెండింగ్.. పనులు స్టాప్
- ఒత్తిడికి లోనవుతున్న కాంట్రాక్టర్లు
- ఇటీవల గుండెపోటుతో ఒకరు మృతి
- పలుచోట్ల అభివృద్ధి పనులకు బ్రేక్

సాక్షి,ఆదిలాబాద్: ఈ రెండు అంశాలు జిల్లాలో బ్రేక్ పడిన అభివృద్ధి పనులు, పలుచోట్ల పనులు చేపట్టినా బిల్లులు అందని కాంట్రాక్టర్ల పరిస్థితికి అద్దం పడుతున్నాయి. మరోవైపు ప్రభుత్వం ప్రస్తుతం పెండింగ్ బిల్లులు చెల్లించే పరిస్థితి లేదని స్పష్టం చేస్తుండడంతో కాంట్రాక్టర్లు మనోవేదనకు గురవుతున్నారు. బిల్లుల కోసం తరచూ హైదరాబాద్ బాట పడుతున్నారు. తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. ఈ క్రమంలోనే కాంట్రాక్టర్ ప్రవీణ్ మృతి చెందినట్లు తెలుస్తోంది. బడాకాంట్రాక్టర్లతో పాటు చోటామోటా కాంట్రాక్టర్లు కూడా పెండింగ్‌లో ఉన్న బిల్లులతో సతమతం అవుతున్నట్లు చెబుతున్నారు.

లైసెన్స్ వదులుకున్న బడా కాంట్రాక్టర్..
తాజాగా ప్రవీణ్ మృతి తర్వాత కొంత మంది రిటైర్డ్ ఇంజినీరింగ్ అధికారులు ఏకంగా కాంట్రాక్టర్లకు సలహా ఇస్తున్నారు. పెండింగ్ బిల్లుల నేపథ్యంలో ఇప్పట్లో ఎలాంటి పనులు చేపట్టవద్దని, అనవసరంగా బయట అప్పు చేసి ఇబ్బందులకుగురికావద్దని పేర్కొనడం సంచలనం కలిగిస్తుంది. ఇదిలా ఉంటే.. జిల్లాలో కొన్నేళ్ల క్రితం తిరుమల, బాలాజీ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీల మధ్య పెద్ద పెద్ద రోడ్ల పనులు చేపట్టేందుకు పోటీ ఉండేది. మధ్యలో బిల్లుల పెండింగ్ నేపథ్యంలో బాలాజీ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ పూర్తిగా కాంట్రాక్ట్ పనులు మానుకొని లైసెన్స్ వదులుకుందనే ప్రచారం ఉంది. ఆ సమయంలో సదరు యజమాని సమయస్ఫూర్తిగా వ్యవహరించి ఈ రంగం నుంచి తప్పుకున్నారని ప్రస్తుతం ఆదిలాబాద్‌లో చర్చ సాగుతుంది. మిగతా కాంట్రాక్టర్లు పనులు చేపట్టి ఒత్తిడిని మూటగట్టుకున్నారని పేర్కొంటున్నారు.

సందెట్లో సడేమియా..
పెండింగ్ బిల్లుల పరిస్థితి ఇలా ఉంటే.. ప్రస్తుతం ఆ బిల్లులను క్లియర్ చేపిస్తామని చెబుతూ పలువురు దళారులు తయారయ్యారనే ప్రచారం సాగుతుంది. ఇలా పెండింగ్ బిల్లులకు సంబంధించి ముందుగానే కమీషన్ తీసుకొని బిల్లు మంజూరు చేయిస్తామని చెబుతూ నెలలు గడిచినా ఆ డబ్బులు రాకపోవడంతో ఇలాంటి బాధితులు మరింత నష్టపోయే పరిస్థితులు ఉన్నాయని పలువురు చెప్పుకుంటున్నారు. ఇదిలా ఉంటే.. ఖమ్మం, వరంగల్, ఇతర జిల్లాలకు సంబంధించి పెండింగ్ బిల్లులు కొంత మేర మంజూరవుతున్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్‌కు సంబంధించిన బిల్లుల క్లియరెన్స్‌లో మాత్రం వివక్ష సాగుతుందనే ప్రచారం లేకపోలేదు. ఇదిలా ఉంటే గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ముందు పలువురు కాంట్రాక్టర్లు పెద్ద ఎత్తున పనులు చేపట్టారు. ఆ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ సమయంలో అనేక పనులకు సంబంధించి అగ్రిమెంట్లు జరిగినప్పటికీ పనులు షురూ కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పనులు చేపట్టాలని కాంట్రాక్టర్ల మీదా ఒత్తిడి తీసుకురావడంతో వారు ఆ పనులు చేపట్టారు. అయితే పెండింగ్ బిల్లుల విషయంలో మాత్రం ఆ కాంట్రాక్టర్లకు మొండి చెయ్యే ఎదురైందన్న అపవాదు ఉంది. ఈ పరిస్థితుల్లో బిల్లులు చెల్లించి, అభివృద్ధి పనుల పరంగా ప్రజలకు అసౌకర్యాలను దూరం చేయాలన్న అభిప్రాయం పలు వురి నుంచి వ్యక్తమవుతుంది. కాగా, పెండింగ్ బిల్లులు, నిలిచిపోయిన అభివృద్ధి పనుల విషయంపై 'సాక్షి' ఆర్‌అండ్‌బీకి చెందిన ఓ అధికారి వివరణ కోరగా, ఆయన స్పందించేందుకు నిరాకరించారు.

దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించాలి

- కలెక్టర్ రాజర్షిషా



దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

సాత్నాల: భూభారతి చట్టం కింద రైతులు, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో భాగంగా భోరజ్ మండలంలోని డొల్లారా గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం ఆధారంగా రైతులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. పైలెట్ ప్రాతిపాదికన జిల్లాలోని భోరజ్ మండలంలో గల 28 గ్రామాల్లో ఈనెల 16వరకు సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వచ్చిన 17 దరఖాస్తులను స్వయంగా పరిశీలించారు. అనంతరం దరఖాస్తుదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. రెవెన్యూ రికార్డుల్లో వివరాలు సమగ్రంగా పరిశీలించాలని, అనంతరం క్షేత్రస్థాయికి వెళ్లి నిబంధనలకు అనుగుణంగా విచారణ చేపట్టాలని పేర్కొన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, తహసీల్దార్ వేణుగోపాల్, రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

విత్తన రశీదులు భద్రపర్చుకోవాలి
బేల: సీజన్ ముగిసే వరకు రైతులు విత్తన రశీదులు భద్రపర్చుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని మండలంలోని సిర్సన్న గ్రామంలో మంగళవారం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త ప్రవీణ్‌కుమార్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ శ్రీధర్ చౌహాన్, శాస్త్రవేత్తలు రాజశేఖర్, మోహన్‌దాస్ సాగులో మెలకువలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో సాయి తేజరెడ్డి, మండల ఉద్యానవన అధికారి అలేఖ్య, పశు సంవర్ధక శాఖ అధికారి శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో మహేందర్‌కుమార్, ఏఈవోలు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
రైతులకు ఇబ్బందులు లేకుండా జొన్నల కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. స్థానిక సబ్ మార్కెట్‌యార్డులో జొన్నల కొనుగోళ్లను తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి కొనుగోళ్లు, ఇబ్బందులపై ఆరా తీశారు. సరిపడా హమాలీలు బుధవారం వరకు యార్డుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా సహకార అధికారి మోహన్‌నాయక్, సహకార సంఘాల చైర్మన్లు, సీఈవో, కార్యదర్శులున్నారు.

కేయూ తీరు.. విమర్శల పాలు

- నేటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు
- ఒకరోజు ముందు హాల్‌టికెట్లు.. చివరి నిమిషంలో కేంద్రాల మార్పు
- మాది ఏ సెంటర్ అంటూ విద్యార్థుల్లో గందరగోళం



బోథ్: డిగ్రీపరీక్షల విషయంలో కాకతీయ యూనివర్సిటీ తీరు విమర్శలకు తావిస్తోంది. పరీక్షలు ప్రారంభమయ్యే ఒకరోజు ముందు హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో ఉంచడం, తీరా వాటిని విద్యార్థులకు పంపిణీ చేశాక.. కేంద్రాలు మార్చడంపై గందరగోళం నెలకొంది. కేయూ పరిధిలో బుధవారం నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు షురూ కానున్నాయి. జిల్లాలో బోథ్, నేరడిగొండ, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, ఉట్నూర్, ఆదిలాబాద్‌లో పరీక్ష కేంద్రాలను అధికారులు కేటాయించారు. ఆయాకేంద్రాల్లో పరీక్షలురాసే విద్యార్థుల హాల్‌టికెట్లను ఒకరోజు ముందు సంబంధిత కళాశాలలకు ఆన్‌లైన్‌లోఅందుబాటులో ఉంచారు. విద్యార్థులు ఉదయం కాలేజీకి వెళ్లి వాటిని తీసకున్నారు. తీరా మధ్యాహ్నం 3.30గంటల ప్రాంతంలో వర్సిటీ అధికారులు దాదాపు అన్ని పరీక్ష కేంద్రాలను మార్చారు. దీంతో విద్యార్థులు తమది ఏ సెంటర్ అంటూ అయోమయానికి గురవుతున్నారు.

పుట్టుక.. చావులో వైవిధ్యం!

- 'ఆడ' కంటే 'మగ' జననమే అధికం
- అధిక మరణాలు కూడా పురుషులవే..
- ఆగని గర్భస్త, నవజాత శిశు మరణాలు
- 'సీఆర్‌ఎస్– 2021' నివేదికలో వెల్లడి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పుట్టుక, చావు మానవ జీవనంలో కీలక ఘట్టాలు. దేశ వ్యాప్తంగా జనన, మరణాలను అధికారికంగా నమోదు చేసే కేంద్ర హోంశాఖ పరిధి రిజిస్ట్రార్ జనరల్, గణాంక కమిషనర్ సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టం (సీఆర్‌ఎస్)–2021 నివేదిక ఇటీవల విడుదల చేసింది. ఈ నివేదికలో ఉమ్మడి జిల్లాలో జననాలు, మరణాలతో పాటు ఏడాదిలోపు శిశువులు, గర్భంలోనే చనిపోతున్న శిశువుల వివరాల్లో ఎంతో వైవిధ్యం కనిపిస్తోంది. ఇక గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్త్రీ, పురుష నిష్పత్తిలో ఏర్పడిన అసమానతలు, జనన, మరణాల్లో నమోదవుతున్న వ్యత్యాసాన్ని స్పష్టం చేస్తున్నాయి.

మగ శిశువుల జననమే అధికం



ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నిర్మల్ జిల్లాలో అధికంగా జననాలు నమోదవుతుండగా, కుమురంభీం ఆసిఫాబాద్‌లో తక్కువగా ఉంది. ఇందులో మగ శిశువుల జననాలే ఎక్కువగా నమోదవుతున్నాయి. ఆడ శిశుల సంఖ్య తగ్గుతోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో లింగనిష్పత్తి తగ్గుతుండగా ఈ నివేదికలోనూ ఇదే తీరువెల్లడైంది. ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం 26,576 మంది అబ్బాయిలు పుట్టగా, అమ్మాయిలు మాత్రం 25,124 మంది జన్మించారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జననాలు..

జిల్లా	గ్రామీణం		పట్టణం		మొత్తం		
	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు	మొత్తం
ఆదిలాబాద్	2,073	1,865	2,710	2,729	4,783	4,594	9,377
నిర్మల్	4,490	4,218	7,002	6,599	11,492	10,817	22,309
మంచిర్యాల	333	320	5,377	5,065	5,710	5,385	11,095
కు.ఆసిఫాబాద్	3,458	3,240	1,132	1,088	4,590	4,328	8,918

కన్నుమూస్తే మరణం..



ఉమ్మడి ఆదిలాబాద్‌లో నిర్మల్ జిల్లాలో మరణాలు అధికంగా నమోదవుతుండగా, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఈ సంఖ్య తక్కువగా ఉంది. మహిళల కంటే మగవారి మరణాలే ఎక్కువగా నమోదయ్యాయి. ఈ వివరాల ప్రకారం 10,455మంది పురుషులు చనిపోతే, స్త్రీలు 7,832 మంది మరణించారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మరణాలు..

జిల్లా	గ్రామీణం		పట్టణం		మొత్తం		
	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు	మొత్తం
ఆదిలాబాద్	1,367	1,206	890	842	2,257	2,048	4,305
నిర్మల్	2,400	1,850	1,356	1,054	3,756	2,904	6,660
మంచిర్యాల	653	574	1,636	1,003	2,289	1,577	3,866
కు.ఆసిఫాబాద్	1,890	1,172	263	131	2,153	1,303	3,456

ఆందోళన కలిగిస్తున్న శిశు మరణాలు



శిశు మరణాలు ఇంకా ఆందోళన కలిగిస్తున్నాయి. పుట్టినప్పటి నుంచి మొదటి పుట్టిన రోజు కూడా జరుపుకోకుండానే ఎంతోమంది నవజాత శిశువులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇందులో పుట్టిన సమయంలోనే అనేక సమస్యలుండగా, కొందరు పెరిగే కొద్దీ వచ్చే అనారోగ్య కారణాలతో మృత్యువాత పడుతున్నారు. నిర్మల్ జిల్లాలో 84మంది, మంచిర్యాలలో గ్రామీణ ప్రాంతంలో ఒక్కరూ చనిపోనప్పటికీ.. పట్టణ ప్రాంతంలో 11మంది, ఆదిలాబాద్‌లో 61, కుమురంభీం ఆసిఫాబాద్‌లో అధికంగా 77మంది నవజాత శిశు మరణాలు నమోదయ్యాయి.

శిశుమరణాలు ఇలా..

జిల్లా	గ్రామీణం		పట్టణం		మొత్తం		
	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు	మొత్తం
ఆదిలాబాద్	27	18	10	06	37	24	61
నిర్మల్	36	42	3	3	39	45	84
మంచిర్యాల	0	0	06	05	6	5	11
కు.ఆసిఫాబాద్	43	29	02	03	45	32	77

స్టిల్ బర్త్ మరణాలూ అధికమే..



20 వారాలు దాటిన పిండం నుంచి ప్రసవ దశ శిశువు వరకు గర్భంలోనే మరణించే స్థితిని స్టిల్ బర్త్‌గా పేర్కొంటారు. ఈ పరిస్థితిని చాలామంది గర్భిణులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఈ పరిస్థితి అధికంగా ఉంది. ఈ నివేదిక ప్రకారం ఈ జిల్లాలో 178 మృతశిశువుల జననాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆ తర్వాత మంచిర్యాల జిల్లాలో గ్రామీణ పరిధిలో నమోదు లేనప్పటికీ పట్టణాల్లోనే 174 నమోదయ్యాయి. ఇక ఆదిలాబాద్‌లో 61, నిర్మల్‌లో 26 నమోదయ్యాయి. గర్భం దాల్చి పిండ వృద్ధి దశలో ఎదురవుతున్న పలు సమస్యలతో గర్భంలోనే ఈ మరణాలు సంభవిస్తున్నాయి.

గర్భస్రావాలు (స్టిల్ బర్త్) ఇలా..

జిల్లా	గ్రామీణం		పట్టణం		మొత్తం		
	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు	మొత్తం
ఆదిలాబాద్	21	20	14	06	35	26	61
నిర్మల్	12	14	0	0	12	14	26
మంచిర్యాల	0	0	94	80	94	80	174
కు.ఆసిఫాబాద్	98	74	04	02	102	76	178

'వీపీవో' పటిష్టంగా అమలు చేయాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

నేరడిగొండ: విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థ పటిష్టంగా అమలు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. నేరడిగొండ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ పోలీసుకు కేటాయించిన గ్రామాన్ని ఎప్పటికప్పుడు సందర్శించాలన్నారు. సమాచార వ్యవస్థ పటిష్టం చేసుకొని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. అలాగే మైనర్ డ్రైవింగ్‌పై దృష్టి సారించాలన్నారు. బహిరంగ మద్యపానం జరగకుండా డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు సంబంధించి సీఈఐఆర్ ద్వారా ఫిర్యాదులు నమోదు చేస్తూ వారికి భరోసా కల్పించాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎస్పీ వెంట ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఇచ్చోడ సీఐ భీమేష్, నేరడిగొండ ఎస్సై ఎల్.శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

చిల్డ్రన్ పార్క్ ప్రారంభం
చిన్ననాటి నుంచే వ్యాయామం అలవర్చుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో చిన్నపిల్లల కోసం ఏర్పాటు చేసిన పార్కును మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇందులో ఏఎస్పీ కాజల్ సింగ్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ శిక్షణ సంస్థలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కె.మిల్కా ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన అనాథలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన బాలికలు మాత్రమే దరఖాస్తుకు అర్హులని పేర్కొన్నారు. కులం,ఆదాయం(అనాథ బాలికలకు అవసరంలేదు), మరణ ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్ పత్రాలు దరఖాస్తుకు జతచేసి జిల్లా కేంద్రంలోని బాలరక్షా భవన్‌లో ఈనెల 18లోగా అందించాలని సూచించారు. వివరాల కోసం 9493433400, 9966490203 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ మహిళ మృతి


సులోచన (ఫైల్)

దండేపల్లి: ఈ నెల 9న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని గూడెం గ్రామానికి చెందిన తాడేటి సులోచన (42) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తహసినొద్దీన్ తెలిపారు. మృతురాలికి కొంతకాలంగా మానసిక స్థితి బాగాలేకపోవడంతో కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రుల్లో చూపించారు. అయినా ఆమె ప్రవర్తనలో ఎలాంటి మార్పురాలేదు. నాకు బతకాలని లేదని తరచూ కుటుంబ సభ్యులతో అంటూ ఉండేది. శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డిమందు తాగి సోదరుడు సత్తయ్యకు ఫోన్‌చేసి చెప్పింది. వెంటనే లక్సెట్టిపేట, అక్కడనుంచి మంచిర్యాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు రెఫర్ చేయగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు సాయిపవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుతో విద్యార్థిని..

నార్నూర్: గాదిగూడ మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని కనక స్వప్న (16) మంగళవారం ఉదయం పాము కాటుతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు కనక పత్తుబాయి, గుణవంతు రావ్ దంపతుల కుమార్తె స్వప్న ఉదయం వాకిట్లో నీళ్ల చల్లుతుండగా పాము కాటేసింది. వెంటనే గాదిగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో 108లో అదిలాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. సకాలంలో వైద్యం అందకపోవడంతోనే విద్యార్థిని మృతి చెందిందని మృతురాలి బాబాయ్ కనక ప్రభాకర్ ఆరోపించారు.

ప్రాణం తీసిన చేపల వేట

కుభీర్: మండలంలోని నిగ్వా గ్రామానికి చెందిన గాదె గంగాధర్ (25) చేపలు పట్టడానికి వెళ్లి వాగులో నీట మునిగి మృతి చెందినట్లు ఎస్సై పీ.రవీందర్ తెలిపారు. గంగాధర్ సోమవారం ఉదయం చేపలు పట్టడానికి వెళ్తున్నానని ఇంట్లో తల్లితో చెప్పి వెళ్లాడు. మధ్యాహ్నం గ్రామానికి చెందిన వ్యక్తి వచ్చి మీ కొడుకు నీట మునిగాడని చెప్పాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం గజ ఈతగాళ్లతో వెతికించగా మృతదేహం లభ్యమైంది. మృతుని తల్లి లక్ష్మీబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో పదేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: బాలికను కిడ్నాప్ చేసిన కేసులో నిర్మల్ న్యాయస్థానం నిందితుడికి పదేళ్ల జైలు, రూ.3వేల జరిమానా విధించింది. కోర్టు సమన్వయల అధికారి దల్లు సింగ్ తెలిపిన వివరాల మేరకు ఆదిలాబాద్‌కు చెందిన షేక్ సమీర్ నిర్మల్‌లో నివాసం ఉంటున్నాడు. 2019లో దిలావర్‌పూర్ మండలంలోని సిర్గాపూర్‌కు చెందిన బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడు. బాలిక మామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై సంజీవ్ కేసు నమోదు చేశారు. డీఎస్పీ ఉపేంద్రరెడ్డి విచారణ చేపట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు విశ్వాస్‌రెడ్డి, వినోద్ రావు 14 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జడ్జి శ్రీవాణి పైవిధంగా తీర్పునిచ్చారు.

సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

- ఈ నెల 15నుంచి 26వరకు..
- రోజుకు 30 అదనపు సర్వీసులు
- ఒకటిన్నర శాతం అధిక చార్జీ


మంచిర్యాల బస్టాండ్‌లో బస్సులు


కాళేశ్వరంలోని పుష్కరఘాట్ వద్ద కొనసాగుతున్న పనులు

మంచిర్యాలఅర్బన్/చెన్నూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలో నిర్వహించనున్న సరస్వతీ పుష్కరా లకు టీజీఎస్ ఆర్టీసీ సన్నద్ధమవుతోంది. పుష్కర స్నానాలకు కాళేశ్వరానికి వెళ్లే భక్తులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు చర్యలు చేపట్టింది. ఈనెల 15 నుంచి 26వరకు ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. మంచిర్యాల, చెన్నూర్ నుంచి కాళేశ్వరం వరకు రోజూ 30 ప్రత్యేక బస్సులు నడిపేలా కార్యాచరణ రూపొందించింది. హైదరాబాద్ నుంచి మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు చేరుకునే వీలుంది. ఆదిలాబాద్, నిర్మల్ ఇతర ప్రాంతాల నుంచి మంచిర్యాల మీదుగా వెళ్లే ప్రయాణికులతో రద్దీ పెరిగే అవకాశాలున్నట్లు ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. రోజువారీ బస్సులు పోనూ అదనపు బస్సులు నడిపి ఆదాయం సమకూర్చుకునేందుకు ఆర్టీసీ సమాయత్తమవుతోంది. కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు.

సాధారణ చార్జీ కంటే అదనం

మంచిర్యాల నుంచి కాళేశ్వరం వెళ్లే భక్తులకు ఆర్టీసీ చార్జీలు పెంచింది. సాధారణ చార్జీలతో పోల్చుకుంటే ప్రత్యేక బస్సుల్లో ఒకటిన్నర శాతం అదనపు చార్జీ వసూలు చేసేందుకు నిర్ణయించింది. మహిళలకు మహాలక్ష్మి పథకం వర్తించనుంది. మంచిర్యాల నుంచి కాళేశ్వరం పెద్దలకు రూ.150, పిల్లలకు రూ.80, శ్రీరాంపూర్ నుంచి పెద్దలకు రూ.140, పిల్లలకు రూ.70, చెన్నూర్ నుంచి పెద్దలకు రూ.80, పిల్లలకు రూ.50 చార్జీగా నిర్ణయించారు.

'పుష్కర' విధులకు పీఆర్ ఉద్యోగులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఈ నెల 14 నుంచి 31వ తేదీ వరకు కాళేశ్వరంలో నిర్వహించనున్న సరస్వతీ పుష్కరాలకు మంచిర్యాల జిల్లాకు చెందిన పంచాయతీ రాజ్ జిల్లా, మండల స్థాయి ఉద్యోగులకు విధులు కేటాయిస్తూ పంచాయతీ రాజ్ డైరెక్టర్ సుధాకర్, జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) వెంకటేశ్వర్‌రావుతో పాటు డీఎల్పీవో సఫ్దర్‌అలీ, ఎంపీడీవోలు సత్యనారాయణ (జైపూర్), మోహన్(చెన్నూర్), రాజేశ్వర్ (మందమర్రి), లక్ష్మయ్య (కోటపల్లి), ప్రసాద్ (దండేపల్లి), మండల పంచాయతీ అధి కారులు (ఎంపీవో) శ్రీపతి బాపు (జైపూర్), అజ్మత్‌అలీ (చెన్నూర్), సత్యనారాయణ (మందమర్రి), శ్రీనివాస్ (లక్సెట్టిపేట), బీ శ్రీనివాస్ (బెల్లంపల్లి), ప్రసాద్ (దండేపల్లి), అనిల్ (తాండూర్), అక్తర్ మొయినొద్దీన్ (కోటపల్లి), శ్రీనివాస్ (నెన్నెల), శ్రీనివాస రెడ్డి (వేమనపల్లి), ఉమర్‌షరీఫ్ (హాజీపూర్)కు విధులు కేటాయించారు. వీరంతా కాళేశ్వరంలో 12 రోజులపాటు నిర్వహించనున్న సరస్వతీ పుష్కరాల్లో వివిధ విధులు నిర్వర్తిస్తారు. పారిశుధ్య నిర్వహణ పనులను పర్యవేక్షిస్తారు.

రద్దీకి అనుగుణంగా సర్వీసులు

కాళేశ్వరానికి వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. భక్తులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచుతాం. ఆర్టీసీ సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాసులు, మంచిర్యాల డిపో మేనేజర్

నేటి నుంచి కేయూ డిగ్రీ పరీక్షలు

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీ ఒకేషనల్ తదితర కోర్సుల 2, 4, 6 సెమిస్టర్ల పరీక్షలు, బ్యాక్‌లాగ్ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ల పరీక్షలు ఈ నెల 14నుంచి నిర్వహించనున్నారు. ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో 47 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 77,221మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు మృతి

నస్పూర్: విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని సీతారాంపల్లిలో పాదం రాములు, అమారి నారాయణ, తాళ్లపల్లి సంపత్‌కు చెందిన మూడు గేదెలు మంగళవారం గోదావరి నది సమీపంలోకి మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో పంట పొలాల్లో కిందపడి ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి.

మధుర నగర్‌లో చోరీ

ఖానాపూర్: మస్కాపూర్ పంచాయతీ పరిధిలోని మధురనగర్ కాలనీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాడి శ్రీనివాస్ నివాసంలో చోరీ జరిగిందని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్ ఈనెల 9న కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి వెళ్లాడు. గమనించిన దొంగలు సోమవారం రాత్రి ఇంట్లోకి చొరబడి 2 తులాల బంగారంతో పాటు 5 తులాల వెండి, రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లారు. శ్రీనివాస్ సోదరుడు రాజశేఖర్ ఇంట్లో సీసీ కెమెరాల్లోని పుటేజీ ఆధారంగా ఫిర్యాదు చేశాడన్నారు.

చైతన్యంతోనే అగ్నిప్రమాదాల నివారణ


అవగాహన కల్పిస్తున్న అధికారులు

జైపూర్: ప్రజల్లో చైతన్యం, అవగాహన ద్వా రానే అడవులు, ప్లాంటేషన్లలో అగ్నిప్రమాదా ల నివారణ పూర్తిగా సాధ్యమవుతుందని తె లంగాణ అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేశ్‌కుమార్ తెలిపారు. అటవీ అభివృద్ధి సంస్థ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని ముదిగుంట శివారులోగల నీలగిరి ప్లాంటేషన్‌లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వేసవిలో ప్లాంటేషన్‌లో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగినప్పుడు మంటలు ఎలా ఆర్పాలో స్థానికులకు వివరించారు. బ్లోయర్లతో మంటలు ఎలా నియంత్రించాలో సూచించారు. ప్లాంటేషన్, అటవీప్రాంతాల మీదుగా వెళ్లేవారు బీడీలు, సిగరెట్లు తాగి ఆర్పకుండా పడేయవద్దని తెలిపారు. కాగజ్‌నగర్, బెల్లంపల్లి రేంజ్ ప్లాంటేషన్ల మేనేజర్లు లక్ష్మణ్, సునీత, ఫీల్డ్ సూపర్‌వైజర్లు రాజేశ్, శ్రీనివాస్, వాచర్లు, సిబ్బంది శంకర్, సాయికిరణ్, లచ్చన్న, రాకేశ్, ఓదెలు పాల్గొన్నారు.

ఆదివాసీలు అస్తిత్వాన్ని కాపాడుకోవాలి

- మంత్రి సీతక్క


మాట్లాడుతున్న మంత్రి సీతక్క

జన్నారం: ఆదివాసీలది ఏడు తరాల చరిత్ర అని, తాత ముత్తాతలు ఇచ్చిన అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆదివాసీలందరిపై ఉందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జన్నారం హరిత రిసార్ట్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి మంగళవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసీల జీవన విధానం ప్రత్యేకంగా ఉంటుందన్నారు. కేస్లాపూర్‌లో నాగోబా, మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలతో పాటు, చెట్లు, పుట్టలను పూజిస్తారన్నారు. బీజేపీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ వనవాసి పేరుతో మను ధర్మాన్ని ఆదివాసీలపై రుద్దేందుకు ప్రయత్నిస్తుందని, దీనిని ఆదివాసీలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఉపయోగపడే రోడ్లు, నివాస స్థలాలకు అనుమతులివ్వని ప్రధాని మోదీ ఆదివాసీలు నివాసం ఉండే అడవులు, గుట్టలను తవ్వుకునేందుకు అంబానీలాంటి వారికి అనుమతులిస్తున్నారని విమర్శించారు. ఆదివాసీలు చదువుపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. రాజకీయ శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామాల్లోకి వెళ్లి ప్రజలను చైతన్యపరచాలన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నాన్ని రాహుల్ గాంధీ అడ్డుకున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ ఆదివాసీ శిక్షణ ప్రోగ్రాం కన్వీనర్ రాహుల్ బల్, పార్టీ ఎస్సీ, ఎస్టీ సెల్ జాతీయ అధ్యక్షుడు కొప్పుల రాజు, చెన్నూర్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, వెడ్మ బొజ్జు పటేల్, మాజీమంత్రి వేణు గోపాలాచారి, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

136 క్వింటాళ్ల జొన్నలు సీజ్


జొన్నల వాహనం వద్ద అధికారులు

తాంసి: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డుకు మంగళవారం బయటి వ్యక్తులు తీసుకువచ్చిన 136 క్వింటాళ్ల జొన్నలను సీజ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. జొన్నల అక్రమదందాలో భాగంగా వ్యాపారులు తాంసి కొనుగోలు కేంద్రంలో విక్రయించడానికి తీసుకువచ్చిన జొన్నలను గమనించిన రైతులు నాణ్యతగా లేకపోవడం, బూజుపట్టి ఉండడంతో అధికారులకు సమాచారం అందించారు. మండల వ్యవసాయాధికారి రవీందర్, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి కేశవ్, ఎస్సై దివ్య భారతి జొన్నలను పరిశీలించి ఎవరివని ఆరా తీయగా ఎవరూ ముందుకు రాలేదు. 272 సంచుల్లో మొత్తం 136 క్వింటాళ్లు ఉన్నట్లుగా ఏవో రవీందర్ పేర్కొన్నారు. జొన్నలతో పాటు వాటిని తరలించిన మ్యాక్స్ వాహనాన్ని సైతం గుర్తించి పోలీసులకు అప్పగించినట్లు ఏవో తెలిపారు. కాగా ఇప్పటికే తాంసి సబ్ మార్కెట్‌యార్డులో అక్రమంగా వ్యాపారులు మహారాష్ట్ర నుంచి జొన్నలను తీసుకొచ్చి పెద్ద ఎత్తున విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. మూడు రోజుల క్రితం తాంసి కొనుగోలు కేంద్రానికి మహారాష్ట్ర నుంచి అక్రమంగా జొన్నలను తీసుకొచ్చే క్రమంలో నిపాని వద్ద భీంపూర్ పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే.

కౌన్సిలర్ పదవి ఇప్పిస్తానని రూ.12.50 లక్షలు వసూలు

ఆదిలాబాద్‌టౌన్: తనకు రాజకీయ నాయకులు తెలుసని.. ఏ పార్టీ నుంచైనా ఎన్నికల్లో కౌన్సిలర్ పదవి ఇప్పిస్తానని ఒకరి నుంచి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని వన్‌టౌన్ సీఐ సునిల్ కుమార్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ పట్టణంలోని రణదివేనగర్‌లో నివాసం ఉంటున్న తోకల దేవేందర్ వాటర్‌ప్లాంట్ నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. పట్టణానికి చెందిన వట్టంవార్ వెంకటేశ్ తనకు రాజకీయ నాయకులతో పరిచయం ఉందని, ఏదైనా ఉద్యోగం ఇప్పించడంతో పాటు బిజినెస్ పెట్టిస్తానని చెప్పి అతని వద్ద నుంచి రూ.12లక్షల 50వేలు కాజేశాడు. రూ.2లక్షలు ఫోన్‌పే ద్వారా తీసుకోగా మిగితావి నగదు రూపంలో తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 8న బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని చాందా(టి) వంతెనపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన సిడాం రవి (38) ద్విచక్ర వాహనంపై వస్తుండగా లారీ ఢీకొట్టడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. కాగా మృతుడు హనుమాన్ దీక్షలో ఉన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై మారోతి తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య

లక్సెట్టిపేట: మద్యానికి బానిసై ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని గోదావరి రోడ్‌కు చెందిన తాగరి రాజేశ్ (40), సుమలత దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతుండడంతో సుమలత తన ఇద్దరు పిల్లలను తీసుకుని చొప్పరిపల్లిలోని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుని సోదరి మామిడి రాయబోసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మనోవేదనతో మరొకరు..

బోథ్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని రేండ్లపల్లె గ్రామానికి చెందిన మేస్రం వెంకటేశ్వర్ (31) భార్య రెండేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. మంగళవారం ఉదయం పంట చేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి సుదర్శన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కుళ్లిన మృతదేహం గుర్తింపు

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామ శివారులో మంగళవారం కుళ్లిన మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. మహారాష్ట్రలోని చిక్లి గ్రామానికి చెందిన జక్కుల గజ్జారాం (46) మండలంలోని అర్లి(కె) క్రాస్ రోడ్డు వద్ద ఓ దాబాలో పనిచేస్తున్నాడు. పది రోజుల క్రితం దాబా నుంచి బయటకు వెళ్లిపోయాడు. కల్లూరు వాగు ఒడ్డున ఉన్న గదిలో నుంచి దుర్వాసన రావడంతో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గమనించి పంచాయతీ కార్యదర్శి భోజన్నకు సమాచారమిచ్చాడు. అతను పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతుని జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా జక్కుల గజ్జారాంగా గుర్తించారు. ఘటన స్థలాన్ని భైంసా రూరల్ సీఐ నైలు, ఎస్సై అశోక్ పరిశీలించారు. కార్యదర్శి భోజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా తయారీదారుడిపై కేసు

నెన్నెల: మండలంలోని పెద్ద లంబాడితండా శివారులోని మామిడితోటలో గుడుంబా తయారు చేస్తున్న ఒకరిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. కన్నెపల్లి మండలం వీగాం గ్రామానికి చెందిన బుర్స మారయ్య పెద్దలంబాడితండాలోని మామిడితోటలో నిత్యం నాటుసారా తయారు చేస్తూ విక్రయించేవాడు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా 15 లీటర్ల నాటుసారా లభ్యమైనట్లు తెలిపారు. గుడుంబా స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

నస్పూర్: సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన ఓ చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల రూరల్ సీఐ అశోక్ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అభినవ కాలనీకి చెందిన కూసి తిరుపతి ఈ నెల 9న తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి పెద్దపల్లి జిల్లాలోని చీమలపేట్ వెళ్లాడు. ఈ నెల 10న ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోని రూ.2 వేల నగదు, సుమారు 30 తులాల వెండి ఆభరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు దొంగిలించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 12న రాత్రి కలెక్టరేట్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా మంచిర్యాల నుండి గోదావరిఖని వైపు వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులను అనుమానించి విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి 30 తులాల వెండి ఆభరణాలు, స్విఫ్ట్ కారు, రెండు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. రాసమల్లె గజానంద్, సయ్యద్ అమాన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అంత్యక్రియలకు వెళ్లివస్తూ అనంతలోకాలకు..

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని 61వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన కిష్టాపురపు గంగు (42) భైంసా మండలంలోని మాంజ్రిలో బంధువు అంత్యక్రియలకు హాజరైంది. తిరుగు ప్రయాణంలో ఆటోలో స్వగ్రామం వెళ్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆటో డ్రైవర్ మహ్మద్ అలీ సాహెబ్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న గుండేటి లక్ష్మికి సైతం తీవ్ర గాయాలయ్యాయి. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అవినాష్ కుమార్

భైంసాటౌన్: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ అవినాష్‌కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని నిర్మల్ రోడ్‌లో ఖద్దా హోటల్ సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బంగాలగల్లికి చెందిన ముజాహిద్ ఖాన్ అలియాస్ సుల్తాన్ అలియాస్ ఇంతియాజ్, ఓవైసీనగర్‌కు చెందిన షేక్ అహ్మద్ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. దీంతో వారిని వెంబడించి పట్టుకోగా వారి వద్ద కిలోన్నర ఎండు గంజాయి లభించినట్లు పేర్కొన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ గోపీనాథ్‌తో పాటు ఎస్సై జి.శ్రీనివాస్, కానిస్టేబుళ్లు ప్రమోద్, క్రాంతి, శరత్, హరిబాబు, బాలాజీని అభినందించారు.

నిర్మల్‌లో...

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ రాజేశ్ మీనా తెలిపారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన షేక్ నిజాముద్దీన్ స్థానిక బస్టాండ్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తుండగా పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ పట్టుకున్నారు. అతని వద్ద 200 గ్రాముల గంజాయి లభించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

గంజాయి సాగు చేస్తున్న ఇద్దరు అరెస్ట్

నిర్మల్‌టౌన్: గంజాయి సాగు చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ రాజేశ్ మీనా తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పెంబి మండలంలోని చిన్న గోధుమల గ్రామానికి చెందిన కొమరం దండురావు తన పంటచేనులో కూరగాయల చెట్ల మధ్యలో 14 గంజాయి మొక్కలు, పోచంపల్లి గ్రామానికి చెందిన మెగావత్ కైలాష్ రెండు గంజాయి మొక్కలు సాగు చేయగా పక్కా సమాచారం మేరకు ఖానాపూర్ సీఐ అజయ్, పెంబి ఎస్సై హన్మాండ్లు సోమవారం దాడులు నిర్వహించారు. దండురావు వద్ద నుంచి రూ.లక్షా 40 వేల విలువ గల 14 గంజాయి మొక్కలు, కైలాష్ వద్ద రూ.20వేల విలువగల రెండు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు.

గొలుసు దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో జనవరి 30న ఓ ప్రయాణికురాలిని నమ్మించి ఆమె మెడలో ఉన్న గొలుసు అపహరించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రమోద్ రావు తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చెన్నూర్ మండలం పొక్కూర్ గ్రామానికి చెందిన గద్దె సమ్మక్క బస్టాండులో వేచి ఉండగా లక్సెట్టిపేట మండలం ఊత్కూర్‌కు చెందిన గాజుల రాజారావు ఆమె వద్దకు వచ్చి మాయమాటలు చెప్పి మూడు తులాల గొలుసు అపహరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీ పుటేజీ ద్వారా నిందితుడిని గుర్తించారు. మంగళవారం స్థానిక బస్టాండ్‌లో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి గొలుసు స్వాధీనం చేసుకున్నారు.

వేర్వేరు చోట్ల రెండు బైక్‌లు చోరీ

ఈ నెల 11న బెల్లంపల్లి చౌరస్తాలోని రోజారాణి హాస్పిటల్ వద్ద కాసిపేట మండలం దేవాపూర్‌కు చెందిన పోలగాని లక్ష్మణ్ తన ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేశాడు మధ్యాహ్నం చూసుకునే సరికి బైక్ లేకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై కిరణ్‌కుమార్ కేసు నమోదు చేశాడు. గత నెల 22న స్థానిక గాంధీనగర్, గోపాలవాడకు చెందిన సిద్దోజి కాళిదాస్ తన బైక్‌ను రైల్వేస్టేషన్ హమాలివాడ వైపు పార్కింగ్ చేశాడు. సాయంత్రం వచ్చి చూసే సరికి బైక్ కనిపించలేదు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై అనుషా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ కమ్ కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రాత్రి 10.30 గంటల తర్వాత ఇంటిముందు గుంపులుగా కూర్చోవడం వంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. కాలనీలో అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్డన్ సెర్చ్‌లో భాగంగా కాలనీకి చెందిన ఓ వ్యక్తి బైక్ నంబర్ ప్లేట్ మార్చడంతో అతనిపై కేసు నమోదు చేయడంతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల కళ్లుగప్పి దొంగ పరార్

లక్సెట్టిపేట: దొంగతనం కేసులో జైలుకు తరలిస్తుండగా పోలీసు కళ్లుగప్పి దొంగ పారిపోయాడు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా నస్పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో దొంగతనం కేసులో ఇద్దరు దొంగలను మంగళవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించేందుకు లక్సెట్టిపేట సబ్ జైలుకు పోలీసులు తీసుకొచ్చారు. జైలు లోపలికి తరలిస్తుండగా గజానంద్ అనే దొంగ పోలీసు చేతుల నుంచి తప్పించుకుని పారిపోయాడు. పోలీసులు నిందితుడికి కోసం గాలిస్తున్నారు.

ఇద్దరు యువతులు అదృశ్యం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్‌కు చెందిన యువతి (19), హమాలీవాడకు చెందిన యువతి (18) వేర్వేరుగా అదృశ్యమైనట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన యువతులు రాత్రి వరకు ఇంటికి రాక పోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.